పోలింగ్ కేంద్రాల పరిశీలన

కోటగిరిలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి రమేశ్‌రాథోడ్

కోటగిరి, మార్చి 28 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని ఎత్తొండ, కోటగిరి హైస్కూల్, చావిడి గల్లీతోపాటు పలు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను బాన్సువాడ ఆర్డీవో, ఎన్నికల రిటర్నింగ్ అధికారి రమేశ్ రాథోడ్ గురువారం పరిశీలించారు. తాగునీరు, విద్యుత్ సరఫరా పలు అంశాలను బీఎల్వోను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట కోటగిరి తహసీల్దార్ సునీత, ఎంపీడీవో మనోహర్‌రెడ్డి, బీఎల్వోలు ఉన్నారు.

కొనసాగుతున్న 'పది' పరీక్షలు

ఖలీల్‌వాడి, మార్చి 28 : జిల్లావ్యాప్తంగా పదోతరగతి పరీక్షలు కొనసాగుతున్నాయి. గురువారం నిర్వహించిన బయోలజికల్ సైన్స్ పరీక్షకు జిల్లావ్యాప్తంగా 22,024 మంది విద్యార్థులకు 21,976 మంది హాజరుకాగా.. 48 మంది గైర్హాజరైనట్లు డీఈవో దుర్గాప్రసాద్ వెల్లడించారు. జిల్లావ్యాప్తంగా ఉన్న పరీక్షా కేంద్రాలను స్క్వాడ్‌లు, ప్రత్యేక బృందాలు పరిశీలించినట్లు చెప్పారు.

జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ధర్మారం పాఠశాల విద్యార్థిని

సంహితను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

డిచ్‌పల్లి, మార్చి 28 : మండలంలోని ధర్మారం సాంఘిక సంక్షేమ పాఠశాలకు చెందిన విద్యార్థిని సంహిత.. జాతీయస్థాయి సబ్‌జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైంది. ఆమెను ప్రిన్సిపాల్ సంగీత, ఉపాధ్యాయులు గురువారం అభినందించారు. ఈనెల 29 నుంచి ఏప్రిల్ ఒకటో తేదీ వరకు మహారాష్ట్రలో నిర్వహించే సబ్‌జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొననున్నట్లు స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ నీరజారెడ్డి, పీఈటీ జ్యోత్స్న తెలిపారు.

రైతులకు కృతజ్ఞతలు

ధర్పల్లి, మార్చి 28 : మండలంలోని ప్రాజెక్టు రామడుగు సొసైటీ చైర్మన్‌పై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోవడంతో రైతుల విశ్వాసం నెగ్గిందని, అందరి సహకారంతో సొసైటీ పాలనను మరింత విజయవంతంగా చేపడుతానని అవిశ్వాసంలో నెగ్గిన సొసైటీ చైర్మన్ ధర్మయ్యగారి రాజేందర్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పాలకవర్గాన్ని నిలబెట్టిన ఘనత రైతులు, సభ్యులకే చెల్లుతుందన్నారు. అవిశ్వాస తీర్మానం వీగిపోయేందుకు సహకరించిన డైరెక్టర్లకు కృతజ్ఞతలు తెలిపారు. మెరుగైన సేవలందించేందుకు కృషి చేస్తానని అన్నారు.

నీటి సమస్యను పరిష్కరిస్తాం

- కొత్త కాలనీలో అధికారుల పర్యటన
- కుళాయిలకు మోటర్లు పెట్టొద్దని సూచన

స్థానికులతో మాట్లాడుతూ నీటి సమస్యను తెలుసుకుంటున్న అధికారులు

కోటగిరి, మార్చి 28 : 'ఎత్తొండలో తాగునీటి కష్టాలు.. చుక్కనీరు కోసం కుళాయిల వద్ద కాలనీవాసుల పడిగాపులు' అనే వార్త 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో గురువారం ప్రచురితమైంది. సంబంధిత అధికారులు స్పందించి ఎత్తొండ గ్రామంలోని కొత్త కాలనీలో గురువారం పర్యటించారు. ఎంపీడీవో మనోహర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మున్నీ, ఏఈ ధన్‌రాజ్ కాలనీవాసులతో మాట్లాడి సమస్యను అడిగి తెలుసుకున్నారు. తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, కుళాయిల ద్వారా సరిపడా నీరు రావడం లేదని కాలనీవాసులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. లీకేజీలు ఉన్న పైప్‌లైన్‌లకు మరమ్మతులు చేయించారు. కొంతమంది కాలనీలో కుళాయిలకు మోటరు పెట్టడం ద్వారా నీరు పూర్తి స్థాయిలో రావడం లేదని విచారణలో తేలింది. కుళాయిలకు మోటర్లు పెట్టవద్దని హెచ్చరించారు. రెండు రోజుల్లో కాలనీలో కొత్తగా మోటరు ఏర్పాటు చేసి పూర్తి స్థాయిలో నీటిని అందిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. అధికారుల వెంట పంచాయతీ కార్యదర్శి ఉమాకాంత్ ఉన్నారు.

క్షయ రహిత జిల్లానే లక్ష్యం

కార్యక్రమంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్

ఖలీల్‌వాడి, మార్చి 28 : క్షయ రహిత జిల్లానే మన లక్ష్యమని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిరణ్‌కుమార్ అన్నారు. నగరంలోని న్యూఅంబేద్కర్ భవన్‌లో జిల్లా వైద్యారోగ్య శాఖ, జిల్లా క్షయ నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ క్షయ నిర్మూలన దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం డీఎంహెచ్‌వో సుదర్శనం మాట్లాడుతూ.. జిల్లాను క్షయ రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యంగా కృషిచేస్తున్నామన్నారు. జిల్లా జనరల్ దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమారాజ్ మాట్లాడుతూ.. టీబీ వ్యాధి లక్షణాలు, వ్యాధి వ్యాప్తి చికిత్స, నియంత్రణ చర్యలపై వివరించారు. జిల్లాలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్ల వైద్యాధికారులు, టీబీ నోడల్ పర్సన్, ఆశకార్యకర్తలను సత్కరించారు. మూడు సంవత్సరాలుగా జాతీయ స్థాయిలో పతకాలను తీసుకువస్తున్న ఆర్ఎన్‌టీపీసీ, సంబంధిత సిబ్బందిని ఘనంగా సన్మానించారు. టీబీ నుంచి కోలుకున్న వారిని సన్మానించారు.

కవిత్వం.. జీవన విధానంలో మార్పును తీసుకురావాలి

కార్యక్రమంలో పాల్గొన్న కవులు, రచయితలు

ఖలీల్‌వాడి/ సుభాష్‌నగర్, మార్చి 28 : కవిత్వం, పాటలు ప్రజలను అలరించడమే కాకుండా వారి జీవన విధానంలో మార్పును తీసుకురావాలని విద్యాశాఖ సంయుక్త సంచాలకురాలు సరోజినీదేవి అన్నారు. నగరంలోని కేర్ డిగ్రీ కళాశాలలో హరిదా రచయితల సంఘం ఆధ్వర్యంలో మంచి కవిత్వం, కవి సమ్మేళనాన్ని గురువారం నిర్వహించగా.. ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం పాలడుగు నాగయ్య సమగ్ర సాహిత్యం పుస్తక పరిచయాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఘనపురం దేవేందర్, పంచరెడ్డి లక్ష్మణ్, నరాల సుధాకర్, కాసర్ల నరేశ్‌రావు, తిరుమలప్రసాద్, పద్మజారెడ్డి, సుజాత, లక్ష్మి, వసంత లక్ష్మణ్, మద్దుకూరి సాయిబాబు, గుత్ప ప్రసాద్, సిర్పలింగం, పద్మావతి, శంకర్, ప్రిన్సిపాల్ నవీన్, నాగనాథ్, సాయి, కిరణ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పేకాటస్థావరంపై దాడి

వినాయక్‌నగర్, మార్చి 28 : నగర శివారులోని బోర్గాం (పీ) పరిధిలో ఉన్న ఓ భవనంలో పేకాడుతుండగా టాస్క్‌ఫోర్స్ టీమ్ ఏసీపీ విష్ణుమూర్తి పర్యవేక్షణలో దాడి నిర్వహించారు. సీఐ అంజయ్య ఆధ్వర్యంలో సిబ్బంది లక్ష్మణ్, సుదర్శన్, అనిల్, నర్సయ్య, ఆజాం దాడిచేసి 8 మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.56,800 సీజ్ చేశారు. పట్టుబడిన వారిని ఫోర్త్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు అధికారులు తెలిపారు.

కేతేశ్వరస్వామి విగ్రహావిష్కరణ

విగ్రహావిష్కరణలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు

ఖలీల్‌వాడి, మార్చి 28 : నగరంలోని విగ్రహాల పార్కులో మేదరి కులస్తుల దైవం కేతేశ్వర స్వామి విగ్రహాన్ని ఎంపీ అర్వింద్, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, జడ్పీచైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్‌గౌడ్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమాన్ని మేదరి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడు వెంకట్రాములు, వర్కింగ్ ప్రెసిడెంట్ దర్శనం దేవేందర్, జిల్లా ప్రధానకార్యదర్శి పోశాద్రి, కోశాధికారి బాలయ్య, మేదరి కులస్తుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

దరఖాస్తుల ఆహ్వానం

డిచ్‌పల్లి, మార్చి 28 : తెలంగాణ సాంఘిక, గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో ప్రవేశం కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రాంతీయ సమన్వయాధికారిణి అలివేలు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 23 వరకు దరఖాస్తుల గడువు ఉండగా.. ఈనెల 30వ తేదీ వరకు గడువును పొడిగించినట్లు తెలిపారు. సీట్ల ఖాళీల వివరాలను www.tswreis.in వెబ్‌సైట్‌లో పొందుపర్చామని పేర్కొన్నారు. అభ్యర్థులకు ఏప్రిల్ 21న ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు.

న్యాయశాఖ విభాగంలో రాధాకృష్ణ చౌహాన్‌కు డాక్టరేట్

ప్రొఫెసర్లకు పరిశోధక గ్రంథాన్ని అందజేస్తున్న రాధాకృష్ణ చౌహాన్

డిచ్‌పల్లి, మార్చి 28 : టీయూ – న్యాయ కళాశాల పరిశోధక విద్యార్థి ఎం.రాధాకృష్ణ చౌహాన్ గురువారం డాక్టరేట్‌ను అందుకున్నారు. డాక్టర్ శివకుమారి పర్యవేక్షణలో 'న్యాయ నిర్వహణలో సాంకేతికతకు సంబంధించిన చట్టాలు' అంశంపై రాధాకృష్ణ చౌహాన్ పరిశోధక గ్రంథాన్ని టీయూకి గురువారం సమర్పించారు. క్రీస్తు జ్యోతి కాలేజీ ఆఫ్ లా– బెంగళూరు ప్రొఫెసర్ మోహన్ రావు ఎక్స్‌టర్నల్ ఎగ్జామినర్‌గా వ్యవహరించారు. న్యాయస్థానంలో త్వరితగతిన కేసులను పరిష్కరించే ప్రయత్నంలో సాంకేతికతను జోడించినప్పుడు వచ్చే సమస్యలకు సంబంధించిన చట్టాలు ఎలా ఉపయోగపడుతాయి, కొత్త చట్టాలు చేయాల్సిన అవశ్యకతను రాధాకృష్ణ చౌహాన్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. డాక్టరేట్ పొందిన ఆయనను రిజిస్ట్రార్ యాదగిరి, అభినందించారు. .రాధాకృష్ణ చౌహాన్ సంగారెడ్డి సీనియర్ సివిల్ జడ్జిగా విధులు నిర్వహించారు.

'తనిష్క్' ఆధ్వర్యంలో పోటీలు

ర్యాంప్ వాక్‌లో పాల్గొన్న ప్రభుత్వ జనరల్ దవాఖాన సూపరింటెండెంట్ ప్రతిమారాజ్

ఖలీల్‌వాడి, మార్చి 28 : జిల్లా కేంద్రంలోని తనిష్క్ షోరూంలో జ్యువెల్లరీ, డైమండ్స్ ప్రదర్శనలో భాగంగా మహిళలకు ర్యాంప్ వాక్, సింగింగ్ కాంపిటేషన్‌ను గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ప్రభుత్వ జనరల్ దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమరాజ్, ఆరోగ్య చికిత్సాలయం డైరెక్టర్ ఐశ్వర్య జడ్జిలుగా వ్యవహరించారు. ర్యాంప్ వాక్ చేసి అలరించారు. గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో యాజమాని మహేందర్, రాకేశ్, అర్చన, శ్రీకాంత్ మౌనిక తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

- **నర్సరీ పరిశీలన -** కోటగిరి, మార్చి 28 : మండలంలోని ఎత్తొండలో నర్సరీని ఎంపీడీవో మనోహర్‌రెడ్డి గురువారం పరిశీలించారు. ఎండలు తీవ్రంగా ఉన్నందున మొక్కలు ఎండిపోకుండా చూడాలని కార్యదర్శి ఉమాకాంత్‌కు సూచించారు. అనంతరం ఉపాధి హామీ పనులను పరిశీలించారు. కూలీల సంఖ్యను పెంచాలని ఫీల్డ్ అసిస్టెంట్‌కు సూచించారు.
- **సొసైటీని బలోపేతం చేస్తాం -** సిరికొండ, మార్చి 28 : సిరికొండ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని అన్నివిధాలుగా బలోపేతం చేస్తామని చైర్మన్ గంగాధర్ అన్నారు. సొసైటీ మహాజన సభను గురువారం నిర్వహించగా.. ఆదాయ వ్యయాలను సీఈవో మహ్మద్ అలీ చదివి వినిపించారు. గతంలో సొసైటీలో అవకతవకలకు పాల్పడ్డారని చైర్మన్ ఆరోపించారు. త్వరలోనే సొసైటీకి సంబంధించిన అన్ని వివరాలు ప్రకటిస్తామన్నారు. సమావేశంలో డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.
- **బీజేపీ విస్తృతస్థాయి సమావేశం -** రుద్రూర్, మార్చి 28 : మండలకేంద్రంలోని శశిరేఖ గార్డెన్‌లో రుద్రూర్, కోటగిరి, పొతంగల్ మండలాల బీజేపీ విస్తృతస్థాయి సమావేశాన్ని గురువారం నిర్వహించారు. కార్యక్రమానికి జహీరాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి బీబీపాటిల్ హాజరై మాట్లాడారు. తనను ఎంపీగా ఆశీర్వదించాలని కోరారు.
- **కొనసాగుతున్న బీపీఎడ్ పరీక్షలు -** డిచ్‌పల్లి, మార్చి 28 : టీయూ పరిధిలో బీపీఎడ్ 1, 3వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలు కొనసాగుతున్నాయి. మూడో రోజు గురువారం ఆర్మూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల సెంటర్‌లో నిర్వహించిన పరీక్షకు 81 మంది విద్యార్థులకు 76 మంది హాజరైనట్లు ఆడిట్ సెల్ డైరెక్టర్ గంటా చంద్రశేఖర్ తెలిపారు.
- **గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు -** ధర్పల్లి, మార్చి 28 : మండలంలోని దుబ్బాకలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను గురువారం చేశారు. సుమారు 600 పశువులకు టీకాలు వేశామని జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి జగన్నాథాచారి, సహాయ సంచాలకులు బాలిక్ అహ్మద్ తెలిపారు. కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారి గంగాప్రసాద్, వైద్యసిబ్బంది శివకుమార్, సుభాష్, గోపాలమిత్రలు మహిపాల్, రైతులు, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.
- **నేడు విండో మహాజన సభ -** రుద్రూర్, మార్చి 28 : మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో నేడు (శుక్రవారం) ఉదయం 11 గంటలకు మహాజన సభ నిర్వహించనున్నట్లు విండో కార్యదర్శి లక్ష్మణ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే ఈ సభకు విండో డైరెక్టర్లు, ఖాతాదారులందరూ సకాలంలో హాజరుకావాలని కోరారు.
- **కొనుగోలు కేంద్రాల కోసం ఎదురు చూపు..**

నవీపేట, మార్చి 28: మండలంలో రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పలు గ్రామాల్లో వరి కోతలు పూర్తయ్యాయి. కళ్లంలోనే ఆరబోసుకొని కొనుగోలు కేంద్రాల కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. కొంత మంది రైతులు దళారులకు ధాన్యం విక్రయిస్తున్నారు.

- **పోలింగ్ కేంద్రాల పరిశీలన–** ఎడపల్లి, మార్చి 28: త్వరలో నిర్వహించనున్న పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా మండల కేంద్రంలో గురువారం పోలింగ్ కేంద్రాలను బోధన్ ఆర్డీవో అంబుదాస్ రాజేశ్వర్ తహసీల్దార్ ధన్వాల్‌తో కలిసి సందర్శించారు. పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్ సౌకర్యాలపై బీఎల్‌వోలతో మాట్లాడారు.
- **పారిశుద్ధ్య పనుల తనిఖీ–** ఆర్మూర్‌టౌన్,మార్చి28: ఆర్మూర్ పట్టణంలోని పలు కాలనీల్లో మున్సిపల్ సిబ్బంది నిర్వహిస్తున్న పారిశుద్ధ్య పనులను గురువారం ఉదయం మున్సిపల్ కమిషనర్ తనిఖీ చేశారు. రోడ్లు, డ్రైనేజీలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సూచించారు.
- **ఆర్థిక సాయం–** ఆర్మూర్‌టౌన్, మార్చి28: పట్టణంలోని 26వ వార్డు ఆదర్శనగర్ కాలనీలో ఇటీవల దామెర రాజు(56) మృతి చెందగా బాధిత కుటుంబానికి స్థానిక కౌన్సిలర్ సుజాతా రమేశ్ రూ.5000 ఆర్థిక సాయాన్ని గురువారం అందజేశారు.
- **జీపీ కార్యాలయం తనిఖీ–** రెంజల్, మార్చి 28: మండలంలోని కందకుర్తి జీపీ కార్యాలయాన్ని బోధన్ డీఎల్పీవో వి.సాయిబాబా తనిఖీ చేశారు. గ్రామంలో వివాదంలో ఉన్న కంపోస్టు షెడ్డును 15 రోజుల్లో ఉపయోగంలోకి తీసుకురావాలని, లేని పక్షంలో చర్యలు ఉంటాయని కార్యదర్శి సతీశ్‌చంద్రను హెచ్చరించారు.
- **కార్యవర్గం ఎన్నిక –** శక్కర్‌నగర్, మార్చి 28: బోధన్ బార్ అసోసియేషన్ కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి సీనియర్ న్యాయవాది సీహెచ్‌వీ హన్మంత్‌రావు తెలిపారు. ఉపాధ్యక్షుడిగా అఫ్సర్ పాషా, సంయుక్త కార్యదర్శిగా వాజిద్, కోశాధికారిగా ఎం.శ్రీధర్ బాబు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు వెల్లడించారు. మిగతా పదవులకు ఎన్నికలు నిర్వహించగా అధ్యక్షుడిగా పోశెట్టి, ప్రధాన కార్యదర్శిగా ఎస్ఎస్ఆర్ కోటేశ్వర్ రావు విజయం సాధించినట్లు ప్రకటించారు.
- **'పది' పరీక్షలకు ఏడుగురు గైర్హాజరు –** శక్కర్‌నగర్, మార్చి 28: గురువారం నిర్వహించిన జీవశాస్త్రం పదో తరగతి పరీక్షకు ఏడుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు మండల విద్యాధికారి నాగనాథ్ తెలిపారు. బోధన్ పట్టణంలోని పది కేంద్రాలు, పెంటాకుర్దు, సాలూరా, అమ్మాపూర్ గ్రామాల్లో ఒక్కో కేంద్రం చొప్పున మొత్తం 13 కేంద్రాలకు గాను 2915 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా, 2908 మంది విద్యార్థులు హాజరైనట్లు ఆయన వెల్లడించారు.
- **బేటీ బచావో-బేటీ పడావోపై అవగాహన –** మాక్లూర్, మార్చి 28: మండల కేంద్రంలో బేటీ బచావో – బేటీ పడావో పథకం సంవత్సర కార్యాచరణ ప్రణాళికలో భాగంగా బుధవారం రాత్రి చిత్రపదర్శన ద్వారా గ్రామస్తులకు అవగాహన కల్పించారు. మహిళా సాధికారత కేంద్రం జిల్లా సమన్వయకర్త స్వప్న తదితరులు పాల్గొన్నారు.
- **నీటి సమస్యలు లేకుండా చూడాలి–** భీమ్‌గల్, మార్చి 26: పల్లికొండ, పురాణీపేట్ గ్రామాలను ఎంపీడీవో సంతోష్‌కుమార్ మంగళవారం సందర్శించారు. 'ఉపాధిహామీ'లో ఏర్పాటు చేసిన నర్సరీలను పరిశీలించారు. జీపీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. నీటి సమస్య లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఉపాధిహామీ ఏపీవో నర్సయ్య, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.
- **విగ్రహ ప్రతిష్ఠాపన–** బోధన్ రూరల్, మార్చి 28: మండలంలోని అమ్దాపూర్ శివారులోని బీరప్ప విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం గురువారం కురుమ యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. గ్రామస్తులు పాల్గొన్నారు.
- **ఇసుక ట్రాక్టర్ సీజ్** –రెంజల్, మార్చి 28: అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్సై సాయన్న గురువారం తెలిపారు. జరిమానా కోసం ట్రాక్టర్‌ను తహసీల్దార్‌కు అప్పగించినట్లు తెలిపారు. డ్రైవర్, యజమానిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

క్రీడాకారుడికి సన్మానం

సుశాంక్‌ను సన్మానిస్తున్న పీఈటీలు

మోర్తాడ్, మార్చి28: పాలెం గ్రామానికి చెందిన జాతీయ స్థాయి ప్రోకబడ్డీ క్రీడాకారుడు కుంట సుశాంక్‌ను జిల్లా కబడ్డీ సంఘం ఆధ్వర్యంలో గురువారం పాలెంలో సన్మానించారు. జాతీయస్థాయి జట్టులో రాష్ట్రజట్టుకు కెప్టెన్‌గా ఎంపిక కావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. జిల్లా కబడ్డీ సంఘం, ఆర్మూర్ ప్రాంత పీఈటీలు, పాలెం ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు సన్మానించారు.

చెట్లతోనే మానవ మనుగడ

ఇంటింటికీ తిరుగుతూ అవగాహన కల్పిస్తున్న వలంటీర్లు

మోర్తాడ్, మార్చి28: చెట్లతోనే మానవ మనుగడ సాధ్యమని, ప్రతి ఇంటి వద్ద మొక్కలు నాటి పెంచాలని స్థానిక డిగ్రీ కళాశాల విద్యార్థులు మండల కేంద్రంలో ఇంటింటికీ తిరుగుతూ వివరించారు. ఎన్ఎస్ఎస్ వేసవికాల శిబిరంలో భాగంగా గురువారం నర్సరీ, ప్రకృతివనాలను సందర్శించారు. అక్కడ పెరిగిన కలుపుమొక్కలను తొలగించారు. అనంతరం ఇంటింటికీ తిరుగుతూ.. నీటిఎద్దడిపై సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో పోగ్రాం అధికారి భూపతి, విద్యార్థులు పాల్గొన్నారు.

నందిపేట్ మండల కేంద్రంలోని రాజానగర్ ప్రాంతంలోని జనవాసాల్లోకి గురువారం నెమలి వచ్చింది. కోళ్లతో కలిసి మేత మేస్తూ కలియతిరిగింది. స్థానికులు ఫొటోలు, వీడియోలు తీస్తూ ఆసక్తిగా తిలకించారు. అటవీ ప్రాంతంలో తాగునీరు, మేత దొరకకపోవడంతో నెమలి జనవాసాల్లోకి వచ్చిందని స్థానికులు పేర్కొన్నారు.

- నందిపేట్, మార్చి 28

నేడు చలో భీమ్‌గల్‌ను విజయవంతం చేయాలి

కమ్మర్‌పల్లి/ వేల్పూర్/ భీమ్‌గల్/ మోర్తాడ్, మార్చి 28: భీమ్‌గల్ మండల కేంద్రంలో శుక్రవారం ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించనున్న చలో భీమ్‌గల్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండల కమ్మర్‌పల్లి అధ్యక్షుడు రేగుంట దేవేందర్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో వరికి రూ.500 బోనస్‌ను ప్రకటిస్తామని హామీ ఇచ్చి ఇప్పటి వరకు అమలు చేయకపోవడంతో బోనస్ సాధనకు ఈకార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. రైతులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. భీమ్‌గల్‌లో నిర్వహించన్ను ధర్నా కార్యక్రమానికి మండలంలోని అన్ని గ్రామాల రైతులు హాజరు కావాలని బీఆర్ఎస్ వేల్పూర్ మండల నాయకుడు రేగుల్ల రాములు, పార్టీ భీమ్‌గల్, మోర్తాడ్ మండలాల అధ్యక్షులు దొన్కంటి నర్సయ్య, కల్లెడ ఏలియా వేర్వేరు ప్రకటనల్లో కోరారు.

నేడు బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం

నందిపేట్, మార్చి 28: మండల కేంద్రంలోని షాదీఖానాలో శుక్రవారం బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు మచ్చర్ల సాగర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మాజీ ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి జీవన్‌రెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు. సాయంత్రం ముస్లింలకు ఇఫ్తార్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

పంటరుణాల కోసం రైతులను ఇబ్బంది పెట్టొద్దు

దూపల్లిలో మహాజన సభలో పాల్గొన్న చైర్మన్ భూమారెడ్డి, డైరెక్టర్లు, రైతులు

రెంజల్, మార్చి 28: రైతులకు రూ. రెండు లక్షల రుణ మాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రకటించిందని, ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున పంట రుణాల చెల్లింపు విషయంలో రైతులను ఇబ్బంది పెట్టొద్దని సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు. దూపల్లి సహకార సంఘం చైర్మన్ భూమారెడ్డి అధ్యక్షతన గురువారం మహాజన సభ నిర్వహించారు. దూపల్లి, రెంజల్, నీలా సహకార సంఘాల చైర్మన్లు భూమారెడ్డి, మొహినుద్దీన్, ఇమ్రాన్‌బేగ్ అధ్యక్షతన మహాజన సభలు నిర్వహించారు. ఆరు నెలల జమా, ఖర్చులను సీఈవోలు చదవి వినిపించారు. ఏప్రిల్ 1 నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని, రైతుల సహకారంతో రూ. 41 లక్షల ఆదాయంతో ముందుండగా, రూ. 11. లక్షలతో దూపల్లి సహకార సంఘం సొంత భవనం నిర్మాణం కోసం స్థలాన్ని కొనుగోలు చేసినట్లు చైర్మన్ భూమారెడ్డి తెలిపారు. మాజీ సర్పంచులు, విండో డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

అమ్దాపూర్‌లో

బోధన్ రూరల్,మార్చి 28: మండలంలోని అమ్దాపూర్‌లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం విండో మహాజన సభను సొసైటీ చైర్మన్ గిర్దావర్ గంగారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. సొసైటీ కార్యదర్శి రాజేశ్వర్ ఆదాయ వ్యయాలను చదివి వినిపించారు. అనంతరం పలు తీర్మానాలు చేశారు. సొసైటీ డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

బైక్ ఢీకొని మహిళ మృతి

ఎడపలి, మార్చి 28: మండల కేంద్రంలో గురువారం బైక్ ఢీకొని మహిళ మృతి చెందినట్లు ఎస్సై వంశీకృష్ణారెడ్డి తెలిపారు. ఎస్సై కథనం మేరకు.. మండల కేంద్రానికి చెందిన అల్కె అబ్బమ్మ(41) ఆశ వర్కర్‌గా పని చేస్తున్నది. ఎడపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పని ముగించుకొని రోడ్డు దాటుతున్న క్రమంలో గ్రామానికి చెందిన ఓ యువకుడు బైక్‌తో ఢీకొట్టాడు. దీంతో అబ్బమ్మకు తీవ్ర గాయాలు కాగా స్థానికులు అంబులెన్స్‌లో నిజామాబాద్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. చికిత్సను అందిస్తుండగా మృతి చెందింది. మృతురాలి తండ్రి అబ్బులు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చెరువులో పడి ఒకరు..

ఎడపల్లి, మార్చి 28: మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన చందూర్ భూమయ్య (42) ప్రమాదవశాత్తు గ్రామానికి చెందిన చెరువులో పడి మృతి చెందినట్లు ఎస్సై వంశీకృష్ణారెడ్డి గురువారం తెలిపారు. మృతుడు బుధవారం సాయంత్రం కాలకృత్యాలు తీర్చుకునేందుకు చెరువు